క్లుప్తంగా

నేడు చినరావూరుతోటలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణ పరిధిలోని 14వ వార్డు చినరావూరు తోటలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చినరావూరుతోట–1 సచివాలయం వద్ద సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే సచివాలయంలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియజేసే బోర్డులను ఆవిష్కరించనున్నట్లు వివరించారు. కౌన్సిలర్లు, అధికారులు పాల్గొనాలని కోరారు.

రోడ్డువెంట నిర్భాగ్యుడు



తెనాలి: స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలో గల హోటల్ పక్కన మూసివున్న దుకాణం ఎదుట ఓ వ్యక్తి గత మూడురోజులుగా దిక్కులేకుండా పడివున్నాడు. కదలలేని స్థితిలో ఉన్న అతడికి ఆహారం ఇచ్చినవారు లేరు. విచారిస్తే మూడురోజుల క్రితం ఎవరో అతడిని చెంచుపేటలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నుంచి తీసుకొచ్చి ఇక్కడ వదిలేసినట్టు చెబుతున్నారు. అతడిని పలకరిస్తే తన పేరు రవికిరణ్ అని, రజక చెరువు దగ్గర అని, ఆటోడ్రైవర్‌గా చేశానని మాత్రమే చెప్పగలుగుతున్నాడు. తనకెవరూ లేరని అంటున్నాడు. లేవలేని స్థితి అంటూ నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నాడు. స్వచ్ఛంధ సంస్థలో ప్రభుత్వ అధికారులో పట్టించుకోకపోతే అతడి పరిస్థితి మరింత దీనావస్థకు చేరుకునే ప్రమాదముంది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తెనాలిఅర్బన్: తెనాలి బోసు రోడ్డులోని నెహ్రూనికేతన్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 1998 సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఒక్క చోట చేరి, గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం పాఠశాల వ్యవస్థాపకులు దాసరి ప్రకాశరావు, రంగలక్ష్మి, ప్రస్తుత మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్‌ను ఘనంగా సన్మానించారు. తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమాన్ని చంద్రశేఖర్, నరేన్‌కృష్ణ, డాక్టర్ సయ్యద్ ఖాసీం, గిరీష్‌లు పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతి


తెనాలి రూరల్: రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త దుర్మరణం చెందాడు. తెనాలి మండలం కొలవరం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుంటూరుకు చెందిన ఇద్దరు మెడికల్ రిప్రజెంటేటివ్‌లతో పాటు పట్టణ గంగానమ్మపేటకు చెందిన మైలవరపు శ్రీనివాసరెడ్డి(45) తీవ్రంగా గాయపడ్డాడు. గుంటూరు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. ఆయన మొదట్నుంచి వైఎస్సార్‌సీపీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారు. శ్రీనివాసరెడ్డి మృతిపై స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ఓంకారేశ్వరునికి పూజలు



తెనాలిటౌన్: గంగానమ్మపేటలోని విద్యాపీఠంలో కార్తీకమాసం సందర్భంగా సాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో బాల స్వామిజీ ఓంకారేశ్వరునికి పూజలు జరిపారు. కార్తీకమాసం విశిష్టతను భక్తులకు తెలిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మఠం జాయింట్ సెక్రటరీ ఎం.రమణయ్య, వుప్పల నాగేశ్వరరావు, శ్రీ విద్యాపీఠం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అలరించిన హాస్య వల్లరి



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలోని అన్నమయ్య కళా వేదికపై ఆదివారం సాయంత్రం గుంటూరు హ్యూమర్ క్లబ్ 111వ హాస్యవల్లరి సందడిగా సాగింది. ఆ పిలుపే నా కోరిక, దంత వేదాంతం, మూకాభినయం నాటికలు సభికుల్ని అలరించాయి. ముఖ్య అతిథిగా మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు, విశిష్ట అతిథులుగా డాక్టర్ వి.ఆంజనేయప్రసాద్, యార్లగడ్డ సుబ్బయ్య, లింగ పున్నయ్య, డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు, దేవాలయ కమిటీ అధ్యక్షుడు లంకా విజయబాబు పాల్గొన్నారు. సభాధ్యక్షులుగా ఆచార్య జె.కిశోర్‌బాబు వ్యవహరించారు. క్లబ్ వ్యవస్థాపక కార్యదర్శి షేక్ లాల్‌వజీర్ పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ కొలుపులు ప్రారంభం



గ్రామ దేవతను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు



పసుపు బండి ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: మండల కేంద్రం కొల్లిపర గ్రామంలో శ్రీ గంగానమ్మ అమ్మవారి కొలుపులు ఆదివారం గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని అత్యంత వైభవంగా ప్రారంభించారు. మత సామరస్యానికి ప్రతీకగా హిందువులు, ముస్లింలు కొలుపుల్లో పాల్గొన్నారు. గ్రామ దేవతలైన గంగానమ్మ, ముత్యాలమ్మ, మారెమ్మ, మద్దిరావమ్మలకు ఇచ్చిన ప్రాముఖ్యత గ్రామ పెద్దలు మదార్ సాహెబ్‌కు ఇచ్చారు. దీంతో ముస్లిం పెద్ద ఇంటి నుంచి మదార్ సాహెబ్ ప్రతీకగా జెండాను మేలతాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి రామిరెడ్డి బొమ్మ నాలుగు కూడలిలో ప్రతిష్ఠించారు. హిందూ పురుషులు చుట్టలు, రొట్టెలు నైవేద్యంగా సమర్పించి, తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం గ్రామంలో ప్రతి ఇంటి నుంచి భక్తులు అధిక సంఖ్యలో కలసి మద్దిరావమ్మ ప్రతిమను మేళతాళాలతో, డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పురంలో ఉంచారు. మహిళలు వేలాదిగా తరలివచ్చి నైవేద్యాన్ని సమర్పించి, గ్రామంలో ప్రతి ఒక్కరూ సుఖశాంతులతో వర్ధిల్లాలంటూ భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులు ఏర్పాటు చేసిన పసుపు బండి ఊరేగింపులో పాల్గొని, పూజలు చేశారు. గ్రామ ఆచారం ప్రకారం మొట్టమొదటిగా గ్రామ బండిని మద్దిరావమ్మ చుట్టూ మేళతాళాలతో ప్రదక్షిణలు చేయించిన అనంతరం ట్రాక్టర్లను, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రభ బండ్లను ప్రదక్షిణలు చేయించి, భక్తులు తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. ఎస్‌ఐ ఆర్ రవీంద్రరెడ్డి కొలుపులల్లో ఎటువంటి అల్లర్లు, గొడవలు జగరకుండా పోలీసుబందోబస్తును ఏర్పాటు చేశారు.

నాలుగు దశాబ్దాల స్నేహ పరిమళం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తెనాలిఅర్బన్: నాలుగు దశాబ్దాల క్రితం కాలేజీలో చదువుకున్న డిగ్రీ విద్యార్థులు మళ్లీ కలుసుకున్నారు. వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. కళాశాల రోజులను గుర్తు చేసుకుని పూర్వ విద్యార్థులు మైమరచిపోయారు. తెనాలి వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కాలేజీలో 1979–82లో బీఎస్సీ చదువుకున్న విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. సమావేశంలో ఒకరినొకరు గుర్తుపట్టి పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను కలబోసుకున్నారు. నాటి పూర్వవిద్యార్థుల్లో ఒకరు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రాధారాణి. మరొకరు ప్రముఖ బయోటెక్ కంపెనీ వ్యవస్థాపకులు. వీరిద్దరూ హైదరాబాద్‌లో ఉంటున్నారు. వీరిలో ఒకరు కృష్ణాజిల్లా లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్‌గా చేస్తున్నారు. ఆయన పేరు లయన్ అన్నపరెడ్డి కోటిరెడ్డి. తమకు విద్యాబోధన చేసిన నాటి గురువులు కొసరాజు వెంకట్రావు, ఎ.రాజేశ్వరి, ఎన్.సుగుణ, ప్రస్తుత ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవీంద్రనాథ్, కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్‌ను సత్కరించుకున్నారు. కలసి భోజనం చేశారు. ఆహ్లాదభరితంగా గడిపారు. అంతా కలిసి గ్రూప్ ఫొటో దిగారు. చక్కని అనుభూతులను మూటగట్టుకుని తిరుగు పయనమయ్యారు. కార్యక్రమంలో కాలేజి కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమాన్ని కోటిరెడ్డి, విజయానంద్, డాక్టర్ డీవీ కృష్ణారావు, డాక్టర్ సుధారాణి, ఆర్‌వీఎస్ రాజేశ్వరి, డాక్టర్ ఎ.ప్రసాద్ పర్యవేక్షించారు.

డస్ట్ బిన్‌లోనే చెత్త వేయండి



ర్యాలీలో పాల్గొన్న ఎన్‌సీసీ అధికారులు, విద్యార్థులు

తెనాలిఅర్బన్: చెత్తను రోడ్లపై వేయకుండా డస్ట్ బిన్‌లలో వేయాలని ఎన్‌సీసీ అధికారి సౌమ్య నాయక్ సూచించారు. 22వ ఎన్‌సీసీ బెటాలియన్ ఆధ్వర్యంలో పునీత్ సాగర్ అభియాన్ 2023–24లో భాగంగా మున్సిపల్ బాయ్స్ హైస్కూల్, అంబేద్కర్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థుల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కొందరూ విద్యార్థులు డస్ట్ బిన్‌ల వేషధారణ ధరించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని సూచించారు. ఇలా చేయడం వల్ల పర్యావరణ పరిరక్షణకు దోహదపడే అవకాశం ఉందన్నారు. వాటిని మురుగు కాల్వలో వేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో బాయ్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు షేక్ మౌలాబీ, అంబేద్కర్ కళాశాల కరస్పాండెంట్ మేరిగ్రేస్, ప్రిన్సిపల్ జె.సుధీర్, 22వ ఆంధ్రబెటాలియన్ సిబ్బంది సుబేదార్ నాయక్, దేవేంద్రర్ సింగ్, హవల్దార్ కుష్‌బీర్ సింగ్ పాల్గొన్నారు.

ఇందిరా గాంధీకి ఘన నివాళి



ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తెనాలిటౌన్: దేశ మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం నిర్వహించారు. మారీసుపేటలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ చందు సాంబశివుడు, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఇందిరా గాంధీ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పొన్నూరు నాగసూర్య శశిధరరావు, పార్టీ మండలాధ్యక్షుడు కె.బుల్లయ్య, ఎం.పూర్ణచంద్రరావు, పి.శివకుమార్, పి.స్టీవెన్‌బాబు, కె.కోటేశ్వరరావు, ఎ.కృష్ణ, కొండా రెడ్డి, బి.శ్రీను, పూలేరామ్, వెంకటేశ్వరరావు, టి.శివన్నారాయణ, నామన మల్లికార్జునరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీపీ చెన్నకేశవులకు సన్మానం



ఎంపీపీ చెన్నకేశవులను సన్మానిస్తున్న సొసైటీ నాయకులు

తెనాలిఅర్బన్: రజక వలంటీర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు ధర్మరాజుల చెన్నకేశవులు అభినందన సభను ఆదివారం రజక చెరువు సెంటర్‌లోని ఆర్‌వీఎస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు పోతర్లంక ప్రసాద్ మాట్లాడుతూ తెనాలి ఎంపీపీగా రజక సామాజిక వర్గానికి చెందిన వారికి పదవి ఇవ్వడం అభిందనీయమన్నారు. ఇప్పటి వరకు తెనాలిలో ఇలాంటి సాహోసోపేత నిర్ణయం ఎవరు చేయలేదని చెప్పారు. ఎంపీపీ పదవికి వన్నె తీసుకురావాలని సూచించారు. అనంతరం ఎంపీపీ చెన్నకేశవులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పెదలంక లక్ష్మీ లావణ్య, వీర్లపాటి విజయలక్ష్మి, సొసైటీ ప్రధాన కార్యదర్శి పెటేటి శ్రీనివాస్, మహిళ కార్యదర్శి సునీత నాగలక్ష్మి, జయలక్ష్మి, నాయకులు వెంకటేశ్వరరావు, దుర్గా, సూరిబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసత్యదేవ వ్రత మహోత్సవాలు ఆరంభం



వ్రతం ఆచరిస్తున్న దంపతులు

తెనాలి: పవిత్ర కార్తీక మాసం సందర్భంగా తెనాలిలోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం సత్యదేవ వ్రత మహోత్సవాలు ప్రారంభించారు. కార్తీకమాసంలో ప్రతి ఆదివారం సత్యదేవ వ్రతాలు ఏటా జరుగుతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి ఎం.తిమ్మనాయుడు పర్యవేక్షణలో తొలివారం వ్రతాల్లో 108 మంది దంపతులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు వీరితో శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి వ్రతాన్ని శాస్త్రోక్తంగా ఆచరింపజేశారు. వ్రత విశిష్టతను భక్తులకు తెలియజేశారు. కార్తీక మాసం శివకేశవులకు ఎంతో ప్రీతికరమైన మాసంగా తెలిపారు. ఇలాంటి పవిత్రమైన రోజుల్లో శ్రీసత్యదేవుని వ్రతాలను ఆచరించటం శుభప్రదమని వివరించారు. వ్రతాల్లో పాల్గొన్న దంపతులకు స్వామివారి భోజన ప్రసాదాన్ని అందజేశారు. ఈ నెల 26, డిసెంబరు 3, 10 తేదీల్లోనూ వ్రత మహోత్సవాలు ఉంటాయని ఈవో వెల్లడించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ కుంభం సాయిబాబు, సభ్యులు దేవస్థాన అర్చకులు సత్యనారాయణ గౌతమ్, అళహరి రవికుమార్ పాల్గొన్నారు. కార్తీక మాసంలో ఆదివారం రోజున దేవాలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవం



కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

తెనాలిటౌన్: పట్టణ చెంచుపేట సుల్తానాబాద్‌లోని గురుస్వామి చెరుకూరి రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అయ్యప్పస్వామి మాలధారులు, శివస్వాములు, భవానీ స్వాములు, గురుస్వాములు, భక్తులతో కలిపి సుమారు 1000 మంది పాల్గొన్నారు. గురుస్వామి దుర్గా హరిబాబు స్వామి ప్రత్యేకంగా పూజలు జరిపారు. అయ్యప్ప మాలధారులకు దుస్తులను రమేష్‌బాబు, రామకృష్ణ స్వామి అందజేశారు. పడిపూజ సందర్భంగా వివిధ రకాల వేషధారణలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో చెరుకూరి విశ్వేశ్వరావుస్వామి, అన్నవరపు ప్రసాదరావు, గడ్డం వెంకటరమణమూర్తి, మణికుమార్ స్వామి, దండపాటి కోటేశ్వరరావు స్వామి, శేకూరు స్వామి, వెంకటేశ్వరరావు స్వామి, భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

- గంగానమ్మపేటలోని పాత శివాలయంలో శనివారం రాత్రి కార్తీకమాసం సందర్భంగా కార్తీక కోటి దీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్తీక దీపాలను వెలిగించి పూజలు జరిపారు. ఓం శక్తి ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కల్యాణ నందస్వామి మాట్లాడుతూ దీపం పరబ్రహ్మ స్వరూపం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కడియాల సునీల్‌కుమార్, వఘుల లక్ష్మీసునీత, ఆరమళ్ల కమల, కోనపరెడ్డి, బైరాగి, భక్తులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం శ్రీ పద్మావతి కల్యాణ మండపం వేదికగా జనవరి 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం సంస్కార భారతి అధ్యక్షుడు ఇండ్ల శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య జ్యోతి ప్రకాశనం చేసి ప్రారంభించారు. విద్యార్థుల వందేమాతరం ప్రార్థన గీతంతో పోటీల్ని ప్రారంభించారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు భారతమాత చిత్రానికి రంగులు వేయడం, వేమన పద్యాలు, ఏకపాత్రాభినయం పోటీల్ని నిర్వహించారు. నగరంలోని పలు పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది.

ఉత్సాహంగా గ్రంథాలయ వారోత్సవాలు



విద్యార్థులతో డాక్టర్ పల్లవి



ఫ్యాన్సీ డ్రస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



ముగ్గుల పోటీలో విద్యార్థినులు

తెనాలిటౌన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రూరల్ మండలం కొలకలూరులోని శాఖ గ్రంథాలయంలో ఆదివారం పాఠశాల విద్యార్థులకు ఫ్యాన్సీ డ్రస్ పోటీలు నిర్వహించారు. జాతీయ మహిళా నాయకుల వేష ధారణను విద్యార్థులు ప్రదర్శించారు. విద్యార్థులు ఇందిరా గాంధీ, సావిత్రిభాయి పూలే, రాణి రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీభాయ్, అల్లూరి సీతారామరాజు, జవహర్‌లాల్ నెహ్రూల వేషాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ట్రాన్స్‌కో డీఈఈ కె.సుదర్శన్, కె.నీలిమ, ఉపాధ్యాయులు ఎం.అన్నారావు, సంధ్య, విజయ, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారిణి కడియాల సుజాత పర్యవేక్షించారు.

విద్యార్థినులకు ముగ్గుల పోటీలు

తెనాలిరూరల్: పెదరావూరు శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలను ఆదివారం నిర్వహించారు. గ్రామ జెడ్పీ హైస్కూలు ఆవరణలో జరిగిన పోటీలను ప్రధానోపాధ్యాయురాలు సరళ, చిత్రకళ ఉపాధ్యాయుడు పి. వెంకటకృష్ణ, గ్రంథాలయాధికారి ఎ. రాఘవేంద్రరావు పర్యవేక్షించారు.

మహిళా సాధికారతపై అవగాహన

తెనాలి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక నెహ్రూ రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం మహిళా సాధికారతపై మహిళా దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ తానేటి పల్లవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని చెప్పారు. అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులకు వక్తృత్వం, క్విజ్ పోటీలను తెలుగు పండితుడు వెలగా సుభాస్‌చంద్రబోస్, పాత్రికేయుడు యర్రంశెట్టి హనుమంతరావు నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి కావూరి రమాదేవి పాల్గొన్నారు.

ఐక్యవేదిక రౌండ్ టేబుల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

తెనాలి: ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఐక్యవేదిక కార్యాలయంలో ప్రజలకు అడిగే హక్కు, సామాన్యులకు రక్షణ అంశంపై ఏర్పాటైన సమావేశానికి సంస్థ జిల్లా అధ్యక్షుడు ఆర్.శివకృష్ణ అధ్యక్షత వహించారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు పల్నాటి నాగరాజు, సీపీఎం తెనాలి కార్యదర్శి కె.బాబూప్రసాద్, ఆర్‌టీఐ రాష్ట్ర కార్యకర్త కె.మహేష్, విద్య డిజిటల్ కార్యదర్శి జి.ప్రేమ్‌చంద్ హాజరయ్యారు. ప్రజా హక్కులను కాపాడటం, సామాన్య ప్రజలకు రక్షణ కల్పించటం ఐక్యవేదిక ఉద్దేశంగా చెప్పారు. ఐక్యవేదిక జిల్లా కోశాధికారి ఏడుకొండలు మాట్లాడుతూ తాడేపల్లి మండలం ఉండవల్లిలో జిల్లా స్థాయి మహాసభలు జరుగుతాయని, జయప్రదం చేయాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు బ్రహ్మారెడ్డి, తాడేపల్లి మండల అధ్యక్షుడు రామకృష్ణశెట్టి, పల్లగంటి శ్రీనివాస్, కె.సాంబశివరావు, అభ్యుదయ కవి వీరయ్య, పాల్, ప్రశాంత్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పుష్ప యాగం

పాత గుంటూరు: లాలాపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో కార్తిక మాసం, స్వామి జన్మ నక్షత్రం శ్రవణం సందర్భంగా ఆదివారం అభిషేకం, తొమ్మిది రకాల పుష్పాలతో యాగాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ సూరినేడి దుర్గా వరప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి జొన్నకూటి సూర్యప్రకాశరావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే షేక్ మహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా పాల్గొని. స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఆర్.టి.ఆర్.వి. ప్రసాద్, గోపాలకృష్ణ పుష్పయాగంతో పాటు శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఐక్యతతోనే ఉపాధ్యాయుల సమస్యలకు పరిష్కారం

పొన్నూరు: ఉపాధ్యాయులు ఐక్యంగా ఉండి సమస్యల్ని పరిష్కరించుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు కె. జోజయ్య తెలిపారు. పట్టణంలోని కల్యాణ మండపంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ గుంటూరు జిల్లా నూతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కార్యాలయంలో యూటీఎఫ్ పతాక ఆవిష్కరణ అనంతరం పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జోజయ్య మాట్లాడుతూ 50 ఏళ్ల యూటీఎఫ్ ప్రయాణంలో అనేక హక్కులు సాధించినట్లు చెప్పారు. ఎస్‌టీఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ అధ్యక్షురాలు ఎ.ఎన్. కుసుమకుమారి, సీనియర్ నాయకులు మోహన్‌రావు, రాష్ట్ర ప్రతినిధి కె.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి. ఆదిలక్ష్మి, ఎం. కళాధర్, జిల్లా గౌరవాధ్యక్షులు పి.వి. శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి డి. సాయికృష్ణ, కొండపల్లి నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక వృద్ధాశ్రమానికి శంకుస్థాపన



భూమిపూజ చేస్తున్న సంస్థ బాధ్యులు శ్రీనివాసబాబు, నాగమల్లేశ్వరి దేవి

తెనాలి: పట్టణంలోని స్వచ్ఛంధ సేవా సంస్థ 'పీపుల్ ఆర్గనైజేషన్ సర్వీస్ టు ది ట్రబుల్'(పోస్ట్) ఆధ్వర్యంలో కొల్లిపర మండల గ్రామం కుంచవరంలో నూతనంగా నిర్మించనున్న ఆధ్యాత్మిక వృద్ధాశ్రమం, స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్, సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ సెంటర్ భవన సముదాయానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. సంస్థ వ్యవస్థాపకుడు తన్నీరు శ్రీనివాసబాబు, అధ్యక్షురాలు తన్నీరు నాగమల్లేశ్వరి దేవి భూమిపూజలో పాల్గొన్నారు. ఇప్పటికే నిర్మించిన గోశాలను రిషబ్ జ్యూయలర్స్ అధినేత ప్రకాష్ జైన్ ప్రారంభించి, అందులోకి గోవులను వదిలారు. 'నాసా' పూర్వ శాస్త్రవేత్త డాక్టర్ చందు సాంబశివరావు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, కాకతీయ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ డీఎల్ కాంతారావు, వడ్రాణం మార్కండేయులు, న్యాయవాది వెలినేని రాఘవయ్య, ఉగ్గిరాల సీతారామయ్య, మానవత ఎగ్జిక్యూటివ్ కమిటి అధ్యక్షురాలు కూరపాటి కల్యాణి పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. హైదరాబాద్ నుంచి పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షుడు దామోదరరావు, జిల్లా అధ్యక్షుడు లక్ష్మణరావు, కొల్లిపర మండలాధ్యక్షురాలు పద్మ తమ ప్రసంగాల్లో ధ్యానం విశిష్టతను తెలియజేశారు.

ఆరుగురు జూదరులపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: పేకాట ఆడుతున్న ఆరుగురిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారం 4వ లైనులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.17,500 స్వాధీనం చేసుకున్నారు.

అలరించిన ఘంటసాల స్వర నీరాజనం



పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజ ఆవరణలో శ్రీ శుభాంజలి కళావేదిక అధ్యక్షుడు మేకల పురుషోత్తమ ప్రసాద్ ఆధ్వర్యంలో ఘంటసాల స్వరనీరాజనం పేరుతో ఆదివారం నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకుల్ని విశేషంగా అలరించింది. కార్యక్రమాన్ని సంస్థ మహిళా కార్యదర్శి ధనలక్ష్మీకుమారి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 వరకు గాయకులు మేకల పురుషోత్తమప్రసాద్, పత్రి గాయత్రి, పావని, రజనీ యుగళ గీతాలు, సోలో గీతాలు 116కు పైగా ఆలపించారు. అనంతరం కళాసాధ అధ్యక్షుడు బిళ్లా అశోక్‌ను సత్కరించారు. కాపునాడు అధ్యక్షుడు మిరియాల గోపీకుమార్, మిరియాల ప్రసాదరావు, కళాదర్బార్ అధ్యక్షుడు పాతూరి రంగారావు, వెంకాయమ్మ, డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, యర్రగోపు నాగేశ్వరరావు, దేవ సహాయం, ఆచారి, కళాకారుల సంఘం అధ్యక్షుడు వెంకటస్వామి పాల్గొన్నారు. వ్యాఖ్యాతలుగా దొప్పలపూడి శ్రీనివాసరావు, చీకటి రవికాంత్, పెల్లూరి కృష్ణారావు వ్యవహరించారు. కార్యక్రమాన్ని సంస్థ గౌరవాధ్యక్షుడు సిరిగిరి గణేష్, ఎన్నుబర్ల బ్రహ్మం, కమలికంటి వలి, తుమ్మేటి శ్రీనివాసరావు, శివయ్య నిర్వహించారు.

డాక్టర్ ఉమా జ్యోతికి గోల్డ్ మెడల్



తెనాలిరూరల్: గుంటూరు మెడికల్ కళాశాల సైకియాట్రి విభాగ హెచ్‌ఓడీ డాక్టర్ నీలి ఉమాజ్యోతికి బంగారు పతకం ప్రదానం చేశారు. పట్టణ బోస్ రోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ కార్యాలయంలో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ఉమా జ్యోతికి ఐఎంఏ తెనాలి శాఖ సభ్యులు గోల్డ్‌మెడల్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా 'ఎమర్జెన్సీ సైకియాట్రి' అన్న అంశంపై ఆమె ప్రసంగించారు. డాక్టర్ కొత్త పరిణామ లక్ష్మి స్మారక బంగారు పతకం ప్రదానం చేశారు. ఐఎంఏ తెనాలి శాఖ బాధ్యులు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ కె. అనిల్‌కుమార్, డాక్టర్ కె. శ్యామ్ ప్రసాద్, డాక్టర్ పావని ప్రియాంక, డాక్టర్ బీహెచ్ సాంబిరెడ్డి, డాక్టర్ వి. శేషగిరిరావు, డాక్టర్ జేవీ సుబ్బారావు, డాక్టర్ ఎంపీ సత్యనారాయణ తదితర వైద్యులతో పాటు డాక్టర్ పరిణామలక్ష్మి తనయులు డాక్టర్ రవికిరణ్, డాక్టర్ శశికిరణ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.